క్లుప్తంగా

ఇళ్ల స్థలాలు కేటాయించాలి



కొత్తకోట రూరల్: మండలంలోని రాయిణిపేట సమీపంలోని 560, 564 సర్వే నంబర్‌లో గల ప్రభుత్వ భూమిలో గ్రామానికి చెందిన నిరుపేదలకు 200గజాల ఇంటి స్థలం కేటాయించాలంటూ ఎంపీటీసీ రాధమ్మ ఆధ్వర్యంలో సోమవారం కొత్తకోట చౌరస్తా నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ బాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించి గతంలో సర్టిఫికెట్లు ఉన్న వారికి, కొత్తగా ఇంటి స్థలం కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి 200గజాల స్థలం ఇవ్వాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత



పెబ్బేరు: మండలంలోని రంగాపూర్‌కు చెందిన సీఏ విద్యార్థి కావలి భానుప్రకాష్‌కు సోమవారం కృష్ణారెడ్డి రూ.50 వేలు ఆర్థికసాయం అందజేశారు. పేద కుటుంబానికి చెందిన విద్యార్థి ఉన్నత చదువుల కోసం ఆర్థికసాయం చేసిన కృష్ణారెడ్డిని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గట్టయ్య, పెద్దింటి వెంకటేష్, కురుమయ్య, భాస్కర్, లక్ష్మన్న, కొండన్న, నరేష్, బాలకృష్ణ, మల్లయ్య, చెన్నయ్య, భగవంతు, మహేష్, రాములు, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమంపై ధ్యాస లేదు



వనపర్తి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్ బృందం ఆస్తులు వెనకేసుకోవడంపై పెట్టే ధ్యాసలో కొంతైనా ప్రజల బాగు కోసం పెడితే వారి ఇబ్బందులు తొలగిపోతాయని రాష్ట్ర తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి నందిమల్ల శారద అన్నారు. ఈ మేరకు పెరిగిన నిత్యావసర ధరలు తగ్గించాలని కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలోని బ్రహ్మనంద రెడ్డి పార్కు ఎదురుగా రాష్ట్ర తెలుగు మహిళల ఆధ్వర్యంలో ధర్నా చేపటకూరగాయల ధరలు పెరిగినా ప్రభుత్వం సమీక్షలు నిర్వహించలేదని, కనీసం వాటిని పట్టించుకోకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

మూలమల్లలో పిడుగుపాటు



ఆత్మకూర్: మండలంలోని మూలమల్లలో సోమవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా గ్రామంలోని కావలి చింతలన్న ఇంటి పక్కన ఉన్న కొబ్బరి చెట్టు కింద నీటి తొట్టిపై పిడుగు పడింది. దీంతో ఇంటి గోడ పాక్షికంగా దెబ్బతినడంతో పాటు, విద్యుత్ తీగలు, బోర్డు పూర్తిగా ధ్వంసమయ్యాయి. నీటి తొట్టి పగిలి ఎదురింట్లో ఉండే రామేశ్వరమ్మ కాలికి గాయాలయ్యాయి. ఈ ఘటనతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. గ్రామస్తులు సంఘటన స్థలంలో గుమిగూడారు. ప్రాణనష్టం వాటిల్లకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

మట్టి వేయడంలో నిర్లక్ష్యం

అమరచింత: పట్టణంలో నూతనంగా నిర్మించిన సీసీ రహదారుల పక్కన ఏర్పడ్డ గోతులను భర్తీ చేయడానికి మట్టిని వేయడంలో సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రధాన రహదారులపై వేసిన రోడ్డుకు అటు, ఇటు వైపులా నేల, రోడ్డుకు సమాంతరంగా ఉండే విధంగా మట్టితో భర్తీ చేయాల్సి ఉండగా కేవలం అక్కడక్కడ జేసీబీ సహాయంతో మట్టినితో సరిచేస్తు చేతులు దులుపుకుంటున్నారని ఆయా కాలనీల ప్రజలు తెలిపారు. పట్టణంలో సుమారు రూ.3.5 కోట్లతో సీసీ రహదారులను నిర్మించిన కాంట్రాక్టర్ నిబంధనలకు విరుద్ధంగా పనులు చేస్తున్నా సంబంధిత అధికారులు, మున్సిపల్ పాలక మండలి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పనులు నాణ్యతగా చేపట్టాలి

పాన్‌గల్: జీపీ భవన నిర్మాణం పనులు నిబంధనల మేరకు నాణ్యతగా చేపట్టాలని పీఆర్ ఏఈ సత్తయ్య కాంట్రాక్టర్‌కు సూచించారు. సోమవారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న నూతన పంచాయతీ భవన నిర్మాణం పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణం పనులను మూడు నెలల్లో పూర్తి చేయాలన్నారు. నిబంధనలను విస్మరించిన, నాణ్యత పాటించకపోయినా బిల్లులను నిలుపుదల చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శాంతమ్మ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా అంతంతే..

- భగీరథ అధికారుల తీరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం
- సభలో ప్రస్తావించినా మారలే
- సమస్యల పరిష్కారంలో తీవ్ర జాప్యం



తాగునీటి సమస్యపై ఏఈని ప్రశ్నిస్తున్న సర్పంచ్

మదనాపురం: మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ సురక్షిత తాగునీటిని అందిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వ లక్ష్యానికి క్షేత్ర స్థాయిలో అధికారులు గండికొడుతున్నారని ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఎంపీపీ జున్ను పద్మావతి మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభం కావలసిన సభ కోరం లేకపోవడంతో గంటన్నర ఆలస్యంగా ప్రారంభమైంది. ముందుగా ఎంపీపీ ఆయా శాఖల వారీగా నివేదికలను కోరారు. వ్యవసాయ శాఖ వివరాలను ఏఈ మున్నా సభకు వివరించారు.

కలుషిత నీటి సరఫరా

మిషన్ భగీరథ ఏఈ శివానంద్ మాట్లాడుతుండగా.. కరివెన సర్పంచ్ అనిత, ద్వారకానగర్ సర్పంచ్ అనిత కలగజేసుకొని తమ గ్రామాలకు తాగునీటికి బదులు కలుషిత నీరు వస్తుందని, ప్రస్తుతం వర్షాకాలం కావడంతో రోగాలు వచ్చే ప్రమాదం ఉందని సభలో ప్రస్తావించారు. పైపుల్లో నీటి సరఫరా అంతంత మాత్రంగానే ఉందని, కొన్ని నల్లాలు పూర్తిగా బంద్ అయ్యాయని తెలిపారు. ఎన్నిసార్లు విన్నవించినా ఏఈ పట్టించుకోవడం లేదని, కనీసం ఫోన్ కూడా ఎత్తడం లేదని మండిపడ్డారు. ప్రజాప్రతినిధులమని కనీస గౌరవం ఇవ్వట్లేదని ఆరోపించారు. సమావేశాల్లో మాత్రమే చేస్తానని చెప్పి తర్వాత పట్టించుకోవట్లేదని, ప్రజలకు ఏం సమాధానం చెప్పాలని సర్పంచ్‌లు నిలదీశారు. వెంటనే జెడ్పీటీసీ కృష్ణయ్యయాదవ్ కలుగజేసుకొని సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

పర్యవేక్షణ కరువు

ఎంఈఓ కృష్ణయ్య సభలో విద్యా ప్రగతి నివేదిక వివరిస్తుండగా మదనాపురం సర్పంచ్ రాంనారాయణ కలుగజేసుకుని గ్రామాల్లో పాఠశాలలను నిరంతరం తనిఖీ చేయాలని సూచించారు. పాఠశాలలపై ఎంఈఓ పర్యవేక్షణ లేకపోవడంతో విద్యా వ్యవస్థ కుంటుపడుతుందని సభ దృష్టికి తెచ్చారు. రెండు రోజుల్లో ప్రతి పాఠశాలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించాలని కోరారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ, పశువర్ధక శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, పౌరసరఫరాల శాఖ, జాతీయ ఉపాధి హామీ పథకం, ఐకేపీ మహిళా సమాఖ్య, కేజీబీవీ, ప్రగతి నివేదికలను చదివి వినిపించారు.

సమన్వయంతోనే అభివృద్ధి

ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ కృష్ణయ్య మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ఫలాలు పేదలకు అందే విధంగా చూడాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేయకూడదని, అలాగే ప్రవర్తిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీఓ నాగేంద్రం, డీటీ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, నాయకులు

ఖిల్లాఘనపురం: దేశంలోని విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసమే 1949లో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏర్పడిందని ఏబీవీపీ వనపర్తి జోనల్ ఇన్‌చార్జ్ కేదార్‌నాథ్, నగర కార్యదర్శి ఆనంద్, చెన్నయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బస్టాండు వద్ద ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ 1949 జులై 9న ఢిల్లీ యూనివర్సిటీలో పురుడు పోసుకున్న ఏబీవీపీ నేడు దేశంలోని 864 యూనివర్సిటీల్లో పని చేస్తుందన్నారు. జ్ఞానం, శీలం, ఏకత అనే మూడు పదాలను వేదాలుగా చేసుకుని జాతీయ పునర్నిర్మాణం లక్ష్యంగా ముందుకు పోతుందని తెలిపారు. ఎక్కడైతే విద్యార్థులకు సమస్యలు ఉంటాయో అక్కడ ఏబీవీపీ నాయకులు, సభ్యులు ముందుండి వాటిని పరిష్కరిస్తున్నారని వివరించారు. స్వామి వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థుల అభ్యున్నతి పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాము, రమేష్, శివ పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ భార్యాభర్తల ఆందోళన



అమరచింత: తమకు తెలియకుండా తన తండ్రి పేరిట ఉన్న ఇంటిని రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలంటూ సయ్యద్‌నగర్‌కు చెందిన నిస్సార్ దంపతులు మున్సిపల్ కారాలయం ఎదుట బైఠాయించారు. పట్టణానికి చెందిన బుక్క బడేసాబ్‌కు నసీర్, నిస్సార్ ఇద్దరు కుమారులు. కాగా ఉమ్మడిగా ఉన్న సమయంలో బీసీ కాలనీలో ఇంటి నిర్మాణం చేసుకున్నామన్నారు. తండ్రి పేరిట ఉన్న ఇంటిని తన అన్న, వదినలు కుట్ర పూరితంగా ఎవ్వరికీ చెప్పకుండా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని నిస్సార్ వాపోయారు. దీనికి సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలని, తండ్రి మరణాంతరం ఇద్దరికి చెందాల్సిన ఇంటిని ఒక్కరి పేరిట ఎలా ఆస్తి మార్పు చేస్తారని ప్రశ్నించారు. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించమని భీష్మించారు. ఈమేరకు మున్సిపల్ కమిషనర్ మహమ్మద్‌ఖాజాకు వినతిపత్రం అందించారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన పత్రాలను అందిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



కొత్తకోట జెడ్పీహెచ్ బాలికల పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



శ్రీరంగాపురంలో..

వనపర్తి: జిల్లా కేంద్రంలోని నాగవరం బీసీ బాలుర హాస్టల్‌లో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇన్‌చార్జ్ బీసీ వెల్ఫేర్ అధికారి బి.సుబ్బారెడ్డి అభ్యర్థన మేరకు కడుకుంట్ల పీహెచ్‌సీ డాక్టర్ రష్మితారెడ్డి హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. దోమకాటు, వ్యాధుల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు ఆమె సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ ఆంజనేయులు, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించినట్లు మండల వైద్యాధికారి మతీన్, ఎస్‌డీ తేజస్విని తెలిపారు. వర్షాకాలంలో కలరా, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు వ్యాపించకుండా ఉండేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. జ్వరం, దగ్గు, తుమ్ములు, జలుబు వంటివి ఉన్నట్లయితే వెంటనే పరీక్షలు చేయించుకోవాలన్నారు. పాఠశాలలోని 300మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరం ఉన్నవారికి మందులు ఇచ్చామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మంజులత, కవిత, శోభారాణి, గీతాబాయి, మునీంద్రమ్మ, రఘురాంజీ, విజయలక్ష్మి, ప్రభావతి తదితరులు ఉన్నారు.

శ్రీరంగాపురంలో..

పెబ్బేరు రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ వినీలారాణి సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం సీఎస్ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ శిబిరంలో లేబరు కార్డు కలిగిన వంద మంది భవన నిర్మాణ కార్మికులు, గ్రామస్తులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో ఏఎల్‌ఓ వేణుగోపాల్, సీఎస్ హెల్త్ జిల్లా కోర్డినేటర్ నరేష్, వైద్యబృందం, సిబ్బంది పాల్గొన్నారు.

నులిపురుగుల దినోత్సవాన్ని జయప్రదం చేయండి



ఖిల్లాఘనపురంలో మాట్లాడుతున్న వైద్యాధికారి



ఆత్మకూర్‌లో మాట్లాడుతున్న డాక్టర్ శరత్

పాన్‌గల్: చిన్నారుల్లో ఎదుగదల మందగించడానికి కారణమైన నులిపురుగుల నిర్మూలనకు కృషి చేయాలని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి సూచించారు. ఈనెల 20వ తేదీన నిర్వహించే జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేస్తూ జయప్రదం చేయాలన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వైద్యాధికారులు, ఎంఈఓ, ఎంపీడీఓ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నులిపురుగుల నివారణ మాత్రలు ఏడాది నుంచి 19ఏళ్ల లోపు పిల్లలందరికీ అందించేలా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు షహీన్, ఆసియా బేగం, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మండల వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్, ఎంఈఓ ఉషారాణి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ నర్సింహ, నర్సింహ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఉమ్మడి పెబ్బేరు, శ్రీరంగాపూర్ మండలాల ఉపాధ్యాయులకు జాతీయ నులిపురుగుల నివారణ గురించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రాముడు, మండల విద్యాధికారి జయరాములు, హెచ్‌ఎం వరలక్ష్మి, ఎంపీహెచ్‌ఈఓ శివప్ప, హెల్త్ అసిస్టెంట్ రాజశేఖర్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: నులిపురుగుల కారణంగా చిన్నారుల్లో ఎదుగుదల మందగిస్తుందని, నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తిప్పుడంపల్లి వైద్యాధికారి శరత్ అన్నారు. సోమవారం ఆత్మకూర్‌లోని ఎంపీడీఓ కార్యాలయంలో నులిపురుగుల నివారణ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్‌సింగ్, హెల్త్‌సూపర్‌వైజర్లు అయ్యూబ్‌ఖాన్, సురేందర్‌గౌడ్ ఉన్నారు.

గోపాల్‌పేట: ఉమ్మడి గోపాల్‌పేట మండలంలోని ఉపాధ్యాయులకు సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో డాక్టర్ క్లైవిన్‌మార్క్ నులిపురుగుల నివారణపై అవగాహన కల్పించారు. చిన్నారులకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

12న చలో హైదరాబాద్



వనపర్తిలో ఏఈ భాస్కర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

వనపర్తి టౌన్: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యూలర్ చేయాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఈనెల 12న నిర్వహించే చలో హైదరాబాద్ ధర్నాకు కార్మికులను అనుమతించాలని కోరారు. ఈ మేరకు తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మున్సిపల్ కార్యాలయం ఏఈ భాస్కర్ వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ జిల్లా అధ్యక్షుడు గడ్డం కురుమయ్య, కార్మికులు యాదగిరి, బాలు, మన్యం, చందు, మౌలలి తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 12న హైదరాబాద్‌లోని సీడీఎంఏ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని మున్సిపల్ కార్మికుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ప్రభాకర్ తెలిపారు. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని అమరచింత మున్సిపల్ కమిషనర్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. కార్మికులు తమ హక్కులను కాపాడుకునేందుకు న్యాయబద్ధంగా నిర్వహించే కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొనేందుకు వీలును కల్పించాలని కోరారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ కనీస వేతన చట్టం ప్రకారం ప్రతి కార్మికుడికి నెలకు రూ.19వేల చెల్లించాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు సేఫ్టీ పరికరాలను అందజేయడంలో వివక్ష చూపుతున్నారని, వెంటనే వాటిని కార్మికులకు అందించాలన్నారు. కార్యక్రమంలో హరికృష్ణ, ప్రేమ్‌కుమార్, చిన్న ఉన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కృషి



పెబ్బేరు చెరువులో సంబురాలు చేసుకుంటున్న విద్యార్థులు, మత్స్యకారులు, కళాశాల అధ్యాపకులు



ఖిల్లాఘనపురంలో..

ఖిల్లాఘనపురం: జాతీయ మత్స్యకారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలోని బస్టాండు వద్ద వివిధ గ్రామాలకు చెందిన ముదిరాజ్ సంఘం సభ్యులు మత్స్యకారం జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం పండ్లు, స్వీట్లు పంచారు. గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గ్రామంలోని గంగపుత్ర సంఘ భవనం వద్ద సభ్యులు మత్స్యకారుల దినోత్సవాన్ని జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మత్స్యకారుల సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణయ్య మాట్లాడుతూ మత్స్యకారులంతా ఐక్యంగా ఉంటూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం సాగునీరు అందించడంతో పాటుగా 100 శాతం రాయితీతో చేపపిల్లల పంపిణీ చేస్తుందన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని పెద్ద చెరువులో మత్స్య కళాశాల ఆధ్వర్యంలో సోమవారం జాతీయ మత్స్య రైతుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్య సంపద పెంచేందుకు ప్రభుత్వాలు నీలి విప్లవం కోసం ప్రాముఖ్యత వహిస్తూ ఇతర దేశాలకు ఎగుమతులు చేస్తుందని, గ్రామాల్లో చేపలు పెంపకంపై అవగాహన కల్పించి సబ్సిడీ కింద చేప విత్తనం అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేషన్ డీన్ డాక్టర్ నాగలక్ష్మి, దేవానంద్, డాక్టర్ హీరాలాల్ చౌదరి, డాక్టర్ అలీకున్ని, మోహన్, కిరణ్మయి, నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: మత్స్యకార కుటుంబాలు ఆర్థికంగా బలపడేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన వనరులను చేకూర్చి మత్స్యకార రైతులను ఆదుకోవాలని జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్ మేకల సురేందర్‌బాబు, మత్స్యకారుల సంఘం నాయకులు చాపల వెంకటయ్య, సొసైటీ డైరెక్టర్లు బొలమోని పెంటన్న, పగిడన్న విజ్ఞప్తి చేశారు. సోమవారం మండల కేంద్రంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన పలువురు మత్స్యకారులు మత్స్యరైతుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. కార్యక్రమంలో నాగన్న, మహేశ్వర్, వెంకటేశ్వర్లు, యాదయ్య, గోపాల్, బాలనర్సింహా, దర్గేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల చేయండి



ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడుమకాల్వ, డీ 6 కాల్వల ద్వారా సాగునీటిని విడుదల చేసి రైతుల పంటలను కాపాడాలని తూంపల్లి సర్పంచ్ లక్ష్మీకాంత్‌రెడ్డి ప్రజావాణిలో వినతి పత్రం అందించారు. మండల పరిధిలోని ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రతి సోమవారం ఏర్పాటు చేస్తున్న ప్రజావాణికి అధికారులు గైర్హాజరవుతున్నారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు తహసీల్దార్, ఎంపీడీఓ మినహా అన్ని శాఖల అధికారులు డుమ్మాకొట్టారు. కాగా రెండు ఫిర్యాదులు అందాయని, అధికారుల గైర్హాజరు విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ సింధూజ అన్నారు.

విద్యార్థినికి సన్మానం



వనపర్తి టౌన్: విద్యార్థినీలు ఉన్నతంగా చదివి జీవితంలో గొప్ప స్థాయికి చేరుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఫస్ట్ ఇయర్ ఎంపీహెచ్‌డబ్ల్యూలో కోర్సులో సానియా 500 మార్కులకు 480 సాధించడంతో సోమవారం కలెక్టరేట్‌లో సానియాను శాలువ, బొకే సన్మానించి అభినందించారు.

హామీలు నెరవేర్చే వరకు పోరాటం



పాన్‌గల్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు



పెద్దమందడిలో..

వనపర్తి: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. పంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె సోమవారం ఐదో రోజుకు చేరింది. సీపీఎం నాయకుడు గోపాలకృష్ణ, బీఎస్పీ నాయకుడు నాగసమోని చెన్నరాములు దీక్షా శిబిరాన్ని సందర్శించి వారి సంఘీభావం ప్రకటించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేసే పంచాయతీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని డిమాండ్‌చేశారు.

అమరచింత: ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం ఆగదని ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి రాజు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికుల నిర్వహిస్తున్న సమ్మెకు సోమవారం ఆయన మద్దతు పలికారు. కార్యక్రమంలో సురేష్, చెన్నప్ప, నరసింహ, శ్రీను, కథలన్నా, చుక్క అంజన్న తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ కార్మికులు చేపడుతున్న సమ్మె సోమవారం ఐదో రోజుకు చేరుకుంది. పెద్దమందడి మండల పరిషత్ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు బీఎస్పీ వనపర్తి అసెంబ్లీ అధ్యక్షుడు మన్నెం, ఇన్‌చార్జ్ చెన్నరాములు మద్దతు తెలిపారు. 11వ పీఆర్సీ సిఫారస్ మేరకు ప్రతి కార్మికుడికి రూ.19వేల కనీస వేతనం చెల్లించడంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, ఆరోగ్య బీమా చెల్లించాలన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి

పాన్‌గల్: డిమాండ్ల సాధన కోసం పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారానికి ఆరో రోజుకు చేరింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేయడంతో డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో పెంటయ్య, స్వామి, యాదగిరి, నాగన్న, సుగ్రీవుడు, బాలస్వామి, వెంకటయ్య, బాలయ్య, నాగమణి, నాగశేషమ్మ, ఎల్లమ్మ, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: పంచాయతీ కార్మికుల డిమాండ్లు నెరవేర్చకుంటే సమ్మెను ఉధృతం చేస్తామని గోపాల్‌పేట, రేవల్లి మండలాల పంచాయతీ కార్మికులు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ తమ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కార్మికుల్లో ఎవరైనా చనిపోతే రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు.

కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల నిరసన

వనపర్తి: నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీలు నల్లచీరలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో ఆయా కాలనీలు, కూడళ్ల గుండా ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు సంఘీభావం వ్యక్తం చేసి మాట్లాడారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ వ్యవస్థను రద్దు చేసే ప్రయత్నం మానుకోవాలన్నారు. కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం కలెక్టరేట్ ఏఓ భానుప్రకాష్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు నిక్సన్, జిల్లా సహాయ కార్యదర్శి రమేష్, నాయకులు రాములు, మద్దిలేటి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి నారాయణమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు కవిత, నాయకురాలు జ్యోతి, రాధ, సంధ్యారాణి, వెంకటేశ్వరమ్మ, నాగేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు